

పోలీస్ క్వార్టర్స్ శిలాఫలకం ఆవిష్కరిస్తున్న డీజీపీ జేవీ రాముడు

## ఈ నెలలోనే పోలీసు ఖాళీల భర్తీ ప్రకటన

### • డీజీపీ రాముడు వెల్లడి

**విజయనగరం, న్యూస్‌టుడే:** పోలీసు శాఖలో ఖాళీల భర్తీకి ఈ నెల 19 లేక 25 తేదీల్లోగా ప్రకటన విడుదలవుతుందని రాష్ట్ర డీజీపీ జేవీ రాముడు చెప్పారు. ఎన్ని పోస్టులు భర్తీ చేయాలనే అంశంపై ప్రస్తుతం పరిశీలిస్తున్నట్లు తెలిపారు. మంగళవారం ఆయన విజయనగరం జిల్లా కేంద్రంలో పోలీసు నివాస భవనాల ప్రారంభం సహా పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఆంధ్ర-ఒడిశా సరిహద్దు ప్రాంతం ప్రశాంతంగా ఉందని చెప్పారు. మారుమూల ప్రాంతాలకు రహదారులు, సమాచార వ్యవస్థ విస్తరించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవసరమైన నిధులను విడుదల చేస్తున్నాయన్నారు. భోగాపురంలో విమానాశ్రయం ఏర్పాటుతో విజయనగరం జిల్లా మరింతగా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఐజీ విశ్వజిత్, విశాఖ రేంజ్ డీఐజీ సీహెచ్ శ్రీకాంత్, విజయనగరం ఎస్పీ ఎల్‌కేవీ రంగారావు, విశాఖపట్నం, శ్రీకాకుళం ఎస్పీలు పాల్గొన్నారు.

## 50% పైగా కార్యాలయాల తరలింపు

### • త్వరలో మరో 48 విభాగాలు..

### • ఉద్యోగినులకు ఉచిత వసతి సదుపాయం

**ఈనాడు, హైదరాబాద్:** విజయవాడ, గుంటూరు నుంచి ప్రభుత్వ కార్యకలాపాలు కొనసాగించేందుకు ఇప్పటి వరకూ 50 శాతానికిపైగా శాఖాధిపతుల కార్యాలయాలు తరలివెళ్లినట్లు ప్రభుత్వ నివేదికలు చెబుతున్నాయి. వెళ్లిన వాటిలో సింహభాగం కార్యాలయాలు లాంఛనంగా నిర్దేశిత ముహూర్తానికి కొబ్బరికాయ కొట్టినవే. అక్కడ అద్దెకు తీసుకున్న భవనాలను తమ కార్యాలయాలకు అనువుగా మరమ్మతులు, మార్పుచేర్పులు చేయించుకొంటున్నారు. అవి పూర్తయ్యేందుకు మరికొంత సమయం పడుతుందని చెబుతున్నారు. హైదరాబాద్ నుంచి రాజధాని ప్రాంతానికి 102 శాఖాధిపతుల కార్యాలయాలు వెళ్లాల్సి ఉంది. గత నెల 29 నుంచి ఇప్పటి వరకూ 54 వెళ్లగా మిగిలిన 48 విడతలవారీగా వెళ్తాయని అధికార వర్గాలు తెలిపాయి. మరోవైపు 9, 10 షెడ్యూళ్లలోని సంస్థలు హైదరాబాద్‌లో 66 ఉండగా...వీటిలో 8 కార్యాలయాలు పూర్తిగా విజయవాడకు వెళ్లాయి. రాజధాని ప్రాంతానికి వెళ్లిన శాఖాధిపతుల కార్యాలయాలు, సచివాలయ ఉద్యోగులకు సంబంధించిన వసతి గృహ సదుపాయం కోసం ప్రభుత్వానికి ఇప్పటి వరకూ 541 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 56 దరఖాస్తులు ఉప, సంయుక్త కార్యదర్శులవి. వారికి ఎలాంటి ఉచిత సౌకర్యాలు కల్పించడం లేదని అధికారులు తెలిపారు. ఇక ఉద్యోగినులకు సంబంధించి 278 దరఖాస్తులు వస్తే వాటిని ఆమోదించారు. వసతి గృహ సౌకర్యం కోసం ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న ఉద్యోగినులకు నాగార్జున విశ్వవిద్యాలయం ఎదురుగా ఉన్న రెయిన్ ట్రీ పార్క్‌లో 6 నెలలు ఉచిత వసతి సౌకర్యం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఉద్యోగుల వసతి గృహ సౌకర్యం కోసం దరఖాస్తు ఆఖరు తేదీగా జులై 20ని నిర్ణయించే అవకాశాలున్నాయి. apfinance.gov.in వెబ్‌సైట్‌లోని 'రెంటల్ ప్రపోజ్డ్ ఫ్రమ్ ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఫర్ రెయిన్ ట్రీ పార్క్' లింక్‌ను ఓపెన్ చేస్తే రెయిన్ ట్రీ పార్కులోని ఇళ్ల అద్దెల వివరాలు (ప్రభుత్వం నిర్ణయించిన అద్దెలు) తెలుస్తాయి. హైదరాబాద్ నుంచి అమరావతికి తరలివెళ్లిన ఉద్యోగుల పిల్లలకు సంబంధించి 140 మందికి పాఠశాల ప్రవేశాలు కల్పించినట్లు వెల్లడించింది. శాఖలవారీగా తరలివెళ్లిన, వెళ్లాల్సిన కార్యాలయాల వివరాల పట్టిక www.eenadu.net లో..